తెల్లారింది. బుచ్చిబాబు కళ్ళుతెరిచి బద్దకంగా ఒళ్ళు విరుచుకుండటూ గడియారం వంక చూశాడు.

ఏడు గంటలయింది. అమ్మో అనుకుంటూ మంచం మీద నుండి లేచాడు. అ రోజు అతను ఆఫీసుకు వెళ్ళాలి.

సీత ఎప్పుడు లేచిందో ఏమోగాని ఆ గదిలో లేదు. బుచ్చిబాబు గదిలోంచి బయటికి వచ్చాడు. సీత హాల్లో కూర్చొని న్యూస్ పేపర్ చదువుతూ ఉంది.

“నువ్వెప్పుడు లేచావ్ సీత ?” అడిగాడు బుచ్చిబాబు.

“చాలా సేపయింది....” తల త్రిప్పుకుండా పేపర్లోకి చూస్తూనే సమాధానం చెప్పింది సీత .

“మొహం కడుక్కున్నావా?”

“ఊ......”

“నేనూ మొహం కడుక్కొని వచ్చేస్తాను.”

“ఊ......”

బుచ్చిబాబు గబగబా పళ్ళు తోముకుని సీత ప్రక్కన కూర్చున్నాడు. ఆమె అప్పటికే న్యూస్ పేపర్ చదివేసింది. ఆ పేపరుని అందుకుంటూ“ కాఫీ.....” అన్నాడు బుచ్చిబాబు .

“కాఫీ అంటే కాఫీ పరుగెత్తుకువస్తుందా?.....కాఫీ పెట్టాలి కదా?” అంది సీత .

“హబ్బో......హబ్బో! ఏమ సిల్లీ జోకు?!..... మరి తీసుకురా” అన్నాడు బుచ్చిబాబు .

“అహ!.....ఏం దర్జా!!....ఏం? నువ్వేమయినా నా మొగుడివా ఆర్డర్లు వేస్తున్నావు?” కూల్‌గా అంది సీత.

బుచ్చిబాబు చేతిలోని న్యూస్ పేపరు జారి క్రిందపడింది. అతను కళ్ళు పెద్దవి చేసి వెర్రిమొహం వేసుకుని సీత వంక చూశాడు. ఆమె కొట్టిన అ డైలాగు కొంత అర్థంకానట్టు ఎంతో అర్థం అయినట్టూ అనిపించింది.

“మనం పెళ్ళి చేసుకోలేదనీ, మనం భార్యభర్తలము కాదనీ పాపం తమరు మర్చిపోయినట్టున్నారు!” సీత గొంతులో వ్యంగ్యం!!

“హమ్మ రాధా!....ఎంత దెబ్బ కొట్టావే తల్లీ!” అనుకున్నాడు బుచ్చిబాబు.

“అయితే ఇప్పుడేమంటావ్?” బింకంగా అన్నాడు బుచ్చిబాబు.

“నేను నీకు పెళ్ళాన్నికాను కాబట్టి నీకు సేవలుచేసే అవసరం నాకు లేదు. మనం స్నేహితులం......అంతే కదూ?”

బుచ్చిబాబు వెర్రిమొహం వేసుకుని బుర్రకాయ్ ఊపాడు.

“కాబట్టి ఇంటి పనులు మనిద్దరం హాయిగా కలిపి చేసుకోవాలి..... వంతులవారీగా? ..... ఇన్నాళ్ళూ నేను చేశాను. ఈవ్వాల్టినుండి నువ్వు చేయాలి! ఇంటి పనీ వంటపనీ ఒక వారం నీది, ఒకవారం నాది.....”

సీత మొహంలో విజయగర్వం. బుచ్చిబాబు ఊహించిని ఈ పరిణామానికి దెబ్బతిన్నాడు. అతని మొహం పాలిపోయింది.

"ఏం....నేను చెప్పింది కరెక్టు కాదా?" అడిగింది సీత .

కరెక్ట్ కాదని ఎలా అనగలడు?

"కరెక్టేననుకో....."నసుగుతూ ఏదో అనబోయాడు బుచ్చిబాబు.

సీత వెంటనే అందుకుంటూ అంది "వెరీగుడ్ అందుకే వంటగది గట్టుమీద పాల ప్యాకెట్లున్నాయ్.....కట్‌చేసి గిన్నెలోపోసి, పాలు మరగబెట్టి, కాఫీ పెట్టుకురా....కాఫీ తాగిన తర్వాత వంట మొదలుపెడుదువు గాని?....."

బుచ్చిబాబుకు పూర్తిగా అర్థం అయ్యింది... అది తనను దెబ్బ తీయ్యడానికి ఆ రాధ ఇచ్చిన సలహానే అని.

ఏది ఏమైనా వాళ్లు మంచి పాయింటునే లాగారు. అయినా సరే తను ఓడిపోకూడదు. తనది చాలా పెద్ద ఆదర్శం!....దాని కోసం ఇలాంటి చిన్నచిన్న కష్టాలకు ఓర్చుకోవాలి!! బుచ్చిబాబు లేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకుని వంటగది వైపు అడుగులు వేశాడు.

0 0 0

బస్‌స్టాప్‌లో సిటీబస్ దిగి ఆఫీసువైపు వేగంగా అడుగులు వేయసాగాడు బుచ్చిబాబు . అతనికి చాలా కంగారుగా ఉంది. వంట తనే చెయ్యడం వల్ల ఆఫీసుకి దాదాపు ముప్పావు గంట ఆలస్యం అయ్యింది.

మళ్లీ అంతలోనే మేనేజర్ మంగారావ్ రిలీవ్ అయి వెళ్ళిపోవడం గుర్తుకొచ్చింది. ఆఫీసులో బాస్ అనేవాడు లేడు కాబట్టి కాస్త అలస్యంగా వెళ్ళినా ఫర్వాలేదునుకున్నాడు.

ఇందాక సిటీ బస్సులో ప్రయాణిస్తున్నా, ఇప్పుడు నడుస్తూ వున్నా అతను మాత్రం తన సమస్య గురించే అలోచిస్తున్నాడు.

అయితే తను ఎప్పటికి ఇలా కాఫీలూ, టిఫిన్లూ చేస్కుంటూ, అన్నం కూరలు వండుకుంటూ ఉండాల్సిందేనా?

సీత ప్లాన్ అర్థం అయ్యింది. ఆ పన్లన్నీ చెయ్యలేక తను సరెండర్ అయిపోయి పెళ్ళి చేస్కుంటాడని ఆమె ప్లాన్.

కాదు కాదు....అది రాధ ప్లాన్!

పళ్ళు కొరికాడు బుచ్చిబాబు. అతను తల్లి పార్వతమ్మకి అప్పుడప్పుడూ వంటలో సాయం చేస్తుంటాడు కాబట్టి అతనికి కాస్తో కూస్తో వంటొచ్చు!

అందుచేత అతనికి వంట తంటా కాదు. ఎలాగోలా మేనేజ్ చేస్కోగలడు కాబట్టి అతను లొంగడు. ఎన్నాళ్ళు ఇలా చేస్తుందో చూద్దాం అనుకున్నాడు.తెచ్చిపెట్టుకున్న కఠినత్వం ఎవరికి మాత్రం యెన్నాళ్ళుంటుంది?!....

బుచ్చిబాబు ఇలా ఆలోచిస్తుండగానే ఆఫీసు వచ్చేసింది. బుచ్చిబాబు సీట్లో కూర్చోగానే ప్యూను హడావిడిగా అతని దగ్గరికి పరుగెత్తుకు వచ్చాడు.

"ఏం సార్ ఇంత లేటొచ్చారు?" అన్నాడు ఆయాసపడ్తూ.

"ఏం?....ముప్పావు గంటకే కొంపలు మునిగిపోతాయా సిల్లీగా" అన్నాడు బుచ్చిబాబు .

"ముప్పావుగంట కాద్సార్.... అయిదు నిముషాలు లేటొచ్చినా కొంపలు మునిగిపోతాయ్ సార్! కొత్త బాస్ జాయిన్ అయ్యాడు!!"

బుచ్చిబాబు ఉలిక్కిపడ్డాడు.

"ఎప్పుడు" కంగారుగా ప్యూన్ని అడిగాడు.

"నిన్ననే సార్? ఈయన చాలా స్ట్రిక్టులా ఉన్నడు సార్...మీరు రాగానే తన దగ్గరికి పంపించమని చెప్పాడు సార్...త్వరగా వెళ్ళండి సార్!"

"అలాగే..అలాగలాగే...."

బుచ్చిబాబు సీట్లోంచి లేచి తడబడే అడుగుల్తో బాస్ క్యాబిన్ వైపు అడుగులు వేశాడు.

ఇంట్లో సీతతో వేగుతున్నది కాక ఆఫీసులో ఈ చండశాసన ముండా వాడితో సిల్లీగా వేగాలా అనుకున్నాడు.

క్యాబిన్ డోరు తెరిచి లోపల వున్న వ్యక్తిని చూసి బుచ్చిబాబు ఇంతింత కళ్ళు చేసుకుని, నోరు బార్లా చాపి అలానే శిలా ప్రతిమలా ఉండి పోయాడు.

ఆ కొత్త బాస్ యెవరో కాదు. ఏకాంబరం !..... చిత్ర విచిత్ర తిట్ల హారం!

"రావోయ్ రా!... ఏంటక్కడే నిల్చుండిపోయావ్... ఆ నోరు ముయ్ ఈగలూ, దోమలూ దూరిపోగలవ్!" అన్నాడు ఏకాంబరం.

బుచ్చిబాబు సర్దుకుని లోపలికి వెళ్ళి ఏకాంబరం ముందు వినయంగా చేతులు కట్టుకుని నిల్చున్నాడు. అక్కడే మోహన్ కూడా నిల్చున్నాడు.

"నిల్చున్నావేంటోయ్... కూర్చో!...." అన్నాడు ఏకాంబరం కులాసాగా నవ్వేస్తూ.

బుచ్చిబాబు ఆ నవ్వుని చూసి కంగారు పడిపోయాడు.

ఆఫీసుకు లేటుగా వచ్చాననీ వ్యంగ్యం!.... అనుకున్నాడు.

"కూర్చోమంటుంటే..." అన్నాడు ఏకాంబరం చాలా చనువుగా.

మోహన్ కూర్చోబోయాడు.

"నువ్వు కాదు... నువ్వు నిలబడే వుండు. మా బుచ్చి కూర్చుంటాడు!"

"అబ్బే.... వద్దుసార్!.... సారీ సర్!! అసలు ఆలస్యం ఎందుకయ్యిందంటే.. నేను వంట చేసేసరికి..." బుచ్చిబాబు నసుగుతూ చెప్పబోయాడు.

"సర్లేవయ్యా... ఆలస్యం అయితే అయింది. ఆఫీసులో ప్రతి కిల్లారికిత్తిగాడూ ఆలస్యంగా వస్తున్నాడు. నువ్వొక్కడివి అలస్యంగా వచ్చినంత మాత్రన కొంపలేం మునిగిపోవులే...." గలగలా నవ్వేస్తూ అన్నాడు ఏకాంబరం.

మోహన్‌కి అంతా అయోమయంగా ఉంది. తమని జాయినయ్యిన క్షణం నుండీ చిత్ర విచిత్రమైన తిట్లతో దులిపేస్తున్న ఏకాంబరం బుచ్చిబాబుతో ఎంత ఆప్యాయంగా మాట్లాడు తున్నాడు?!... ఏంటీ వీళ్ళిద్దరికీ కనెక్షన్?....

మోహన్ ఆలోచిస్తున్నాడు.

"ఇతను హైదరాబాద్‌లో నా క్రిందే పని చేసేవాడు ....... చాలా మంచి వర్కర్!... పెద్ద డింగాల డిప్పి! ....... " మోహన్‌తో అన్నాడు ఏకాంబరం.

అన్నట్టు వీళ్ళిద్దరూ హైదరాబాద్ బ్రాంచి నుండేగా వచ్చింది?...... ఆ విషయమే మర్చిపోయాను! అనుకున్నాడు.

"మంచి వర్కర్ అని పొగుడుతూనే డింగాల డిప్పి అని తిడ్తున్నారేంటి సార్!..." అమాయకంగా అడిగాడు మోహన్.

"అందుకే నీలాంటి వాళ్ళని గుర్రాల బుర్రి అంటారు! డింగాల డిప్పి అంటే తిట్టు కాదు.... పొగడ్త! నీ కింకా కొత్త కదా... ముందు ముందు నీకే అర్థం అవుతుంది!" మోహన్‌తో అని బుచ్చిబాబు వైపు తిరిగాడు ఏకాంబరం.

"అవునోయ్... ఇందాక నువ్వేంటి వంటా గింటా అంటున్నావ్? ఇంకా యన్నాళ్ళిలా అవస్థ పడతావ్? త్వరగా పెళ్ళి చేసుకో. బెండకాయ ముదిరినా, లింగు లిటికాయ్ ముదిరినా పనికి రాడంటారు..."

"హి హి హి ... అదేనండీ మరి!" అన్నాడు బుచ్చిబాబు ఏమనాలో తెలీక నవ్వేస్తూ.

మోహన్ బుచ్చిబాబు వంక ఆశ్చర్యంగా చూశాడు.

"నువ్విహ వెళ్ళవోయ్....... మేం కాస్త పర్సనల్‌గా మాట్లాడుకోవాలి. సాయంత్రంలోగా నేను చెప్పిన పనంతా పూర్తి చేసి యింటికెళ్ళాలి!"అన్నాడు ఏకాంబరం మోహన్‌తో.

మోహన్ క్యాబిన్‌లోంచి బయటి కెళ్ళిపోయాడు.

"నీకు టింగణాలోయ్...నాకు ట్రాన్సుఫర్ నీ సలహా వల్లే వచ్చింది" అన్నాడు ఏకాంబరం బుచ్చిబాబుతో.

"కానీ మీకు ట్రాన్స్‌ఫర్ కావలసింది గుంటూరుకి కద్సార్?" అడుగాడు బుచ్చిబాబు .

"నిజమే గానీ గుంటూరుకి నెలరోజుల క్రితమే ఓ కిల్లారి కిత్తిగాడిని పోస్ట్ చేశారు. అంత త్వరగా అతన్ని డిస్టర్బ్ చేస్తే బాగుండదు కాదా అనీ నన్ను ఇక్కడికి వేశాడు. పోనీ గుంటూరు ఇక్కడికి అరగంట దూరంలోనే కదా ఉంది!" సంబరంగా అన్నారు ఏకాంబరం.

అక్కడ.....బయట మోహన్ తీవ్రంగా అలోచిస్తున్నాడు. ఏకాంబరం బుచ్చిబాబుతో త్వరగా పెళ్ళి చేసుకోమన్నాడు. బుచ్చిబాబు తనకి పెళ్ళయిందని చెప్పకుండా నవ్వి

ఊరుకున్నాడు.        బాస్ అన్న మాటల్ని బట్టి అక్కడ  హైదరాబాద్ ఆఫీసులో రిలీవ్ అయినప్పుడు బుచ్చిబాబుకి పెళ్ళికాలేదు.

కానీ రిలీవ్ అయిన వెంటనే విజయవాడకి బుచ్చిబాబు సీతతో సహా వచ్చాడు.  అంటే బుచ్చిబాబు సీతని రైల్లో పెళ్ళి చేసుకున్నాడా?

అది జరిగే పని కాదు. అంటే సీత బుచ్చిబాబు భార్య కాదా?

కాకపోతే సీత ఎవరు? బుచ్చిబాబుకి కాబోయే భార్యా?  ప్రేయసా?

ఉంపుడుకత్తా?        ఎవరు?.......ఎవరు?.......ఎవరు???

16

ఆ మురికివాడలో చాలా హడావిడిగా వుంది. ఎన్నోకార్లూ, జీపులూ ఉదయం నుండీ అటూ ఇటూ బుర్రుబుర్రుమని తిరుగుతూ వున్నాయ్. ఫోటోగ్రాఫర్లు, పత్రికా విలేకరులూకూడా హడావిడిగా తిరుగుతున్నారు.

మామూలుగా అయితే ఆ మురికివాడని ఎవరూ పట్టించుకోరు. కానీ అ రోజు అ వాడకి ప్రత్యేకమైనరోజు.

ఎందుకంటే.....ఆ రోజు అక్కడ పందుల పెంపకం ఫారం ఒక దానికి ప్రారంభోత్సవం జరుగుతూ వుంది. ప్రారంభించేది ఎవరోకాదు. ది గ్రేట్ మినిస్టర్ మిన్నారావ్.

అప్పటికి రెండు గంటల్నుండి అందరూ మినిస్టర్ మిన్నారావ్ గురించి ఎదురు చూస్తున్నారు. ఆ ఫారం ఓనర్ ఎల్లయ్యకి ఒహటే టెన్షన్‌గా వుంది. అసలు మిన్నారావ్ వస్తాడా రాడా అని.

ఎల్లయ్య తండ్రి మల్లయ్య గొణిగాడు. "ఓరెధవా... నామాట ఇన్నావా? ఈ మినిస్టరూ, ఆళ్ళూ ఎందుకురా....ఈ పందుల్ని సిన్నప్పట్నుండీ కన్నతల్లిలా పెంశాను. ఆ ఫారం నాతోటి ఓపెనింగ్స్ సేయింసరా అంటే ఇన్లేదు...."

"నువ్వూర్కో ఎహే! నీకేటి తెల్దు! ఇలా మినిస్టర్‌లతో ఓపెనింగ్స్ సేయిస్తే ఎంతే పబ్లిసిటీ అవుద్ది! అసలు ఈ మిన్నారావ్ బాబూ ఒకడు తేరగా దొరికాడు కాబట్టి ఇలా పందుల ఫారాన్ని ఓపెనింగ్స్ సేయిత్తున్నాం గానీ లేకపోతే మినిస్టర్లతో ఇలాంటివన్ని మనం ఓపెనింగ్స్ సేయింసగలమా" తండ్రిమీద విసుక్కున్నాడు ఎల్లయ్య.

తండ్రి అలా విసుక్కున్నా మనసులో మిన్నారావుని బండ బూతులు తిట్టుకున్నాడు టైమైనా ఇంకా రానందుకు.మరో అయిదు నిముషాల్లో రెండు జీవులూ, అయిదు కార్లూ రివ్వున వచ్చి అక్కడగాయ్, వాటిల్లో ఒక కారులోంచి మినిస్టర్ మిన్నారావ్ దిగాడు.ఎల్లయ్య మరికొంత మంది మినిస్టర్ మిన్నారావ్‌కి పరుగున ఎదురెళ్ళి అతడ్ని పూలమాలల్తో ముంచెత్తి వేసారు.

"ఓరి ఓరి ఓరి నేను మినిట్టార్ని అయినప్పుడు కూడ ఇన్ని దండలు ఎవరూ వెయ్యలేదు

కదయ్యా మీ పందులు పదేసి పిల్లల్ని పెట్టా” సంబరపడిపోతూ అన్నాడు మినిస్టర్ మిన్నారావ్.“ నేను లేటుగా గానీ రాలేదు కదా?” అని అడిగాడు మెడలో దండలు సర్దుకుంటూ.

“లేదయ్యా సరిగ్గా సమయానికి వచ్చారు“ అన్నాడు ఎల్లయ్య వినయంగా.

“నేను సమయానికి వచ్చాను కదా అని మీరు అలీసెం సెయ్యమాకండీ. ఏది.....ఒకత్తెరిటు పారెయ్యండి రిబ్బన్‌ని లటుక్కున కత్తిరించి ఓపెనింగ్స్ సేసి పారేస్తా... నాకవతల బోల్డన్ని అర్జంటు పనులున్నాయ్ గవర్నమెంటుని నడపడమా మజాకానా?” హడావిడి పడిపోతూ అన్నాడు మిన్నారావ్.

ఎల్లయ్య మినిస్టర్ మిన్నారావ్‌ని ఓ పెద్ద పాక దగ్గరికి తీసుకెళ్ళాడు జనం అంతా వాళ్లని ఫాలో అయ్యారు.

“ఇదే బాబయ్య పందుల ఫారం” అంటూ ఎల్లయ్య మిన్నారావ్ చేతికి కత్తెర ఇచ్చాడు.

“ఓర్నీ ఇదేంటి మామూలు కత్తెర ఇచ్చావ్. ఇది నా చంకలో ఎంట్రికలు కత్తిరించుకోడానికి కూడ పనికి రాదు. ఇట్టాంటి ఓపెనింగ్స్‌కి నా కందరూ వెండి బంగారు కత్తెర్లు ఇస్తారు తెల్సా?” ఎల్లయ్య చెవిలో అన్నాడు మిన్నారావ్.

“గుడిసెల్లో వుండేవాళ్ళం. మేం వెండి, బంగారు కత్తెర్లు యాడివ్వగలం సామీ...... ఈ సారి సర్దుకో బాబయ్య! తమరి సేతుల మీదుగా ఈ ఫారం వృద్ధి సెందితే మరో ఫారం పెట్టి దాన్ని ఓపెనింగ్ సేయించేప్పుడు ఎండి కత్తెర ఇస్తానయ్యా!” అన్నాడు ఎల్లయ్య సణుగుతూ.

“సరె...సరె... ఈ రాత్రి ఇంటికి మంచి పంది మాంసం పంపించు. కనీసం ఆ పనైనా సెయ్యి” మొహం చిట్లిస్తు అన్నాడు మిన్నారావ్.

“అట్టాగేనయ్యా.. మీరిక ఓపెనింగ్స్ సేసెయ్యండయ్యా!”

కెమెరాలు క్లిక్ క్లిక్ మంటూండగా మినిస్టర్ మిన్నారార్ చిరు నవ్వులు చిందిస్తూ రిబ్బన్ కత్తిరించాడు.

ఆ తరువాత ఆ పాకలోకి గభాలున పరిగెత్తి ఓ పంది పిల్లను అమాంతం ఎత్తుకుని దానిని ముద్దులతో ముంచెత్తాడు.

“హర్రె ఫోటోలు తియ్యరేందయ్యా” అన్నాడు ఫోటోగ్రాపర్సు వంక చికాకుగా చూస్తూ.

ఫోటోగ్రాఫర్లు ఫోటోలు తీస్తుండగా మిన్నారావ్ పందిపిల్లలను మరోసారి ముద్దుల్లో ముంచెత్తాడు. ఆ తరువాత అక్కడున్న జనాన్ని ఉద్దేశించి చిన్న ప్రసంగం చేసాడు మిన్నారావ్.

“ప్రియమైన సోదర సోదరీమణాలారా... నేను చెప్పొచ్చేదేంటంటే ఈనాడు పందులకి మనుషులకంటే ఎక్కువ విలువ వుందని నేడు నేను పందులు ఫారాన్ని ఓపెనింగ్స్ చెయ్యడమే చెపుతుంది. మా ప్రభుత్వానికి పందులంటే చాలా అభిమానం. అందుకే మా పార్టీ యమ్మెల్లేలూ

, మంత్రులూ పందుల్లా ప్రవర్తిస్తున్నారు. దీనిని మన రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. కాబట్టి నేను సవినయంగా మనవి చేసేదేంటంటే ప్రభుత్వం పందులు పెంచడానికి విరివిగా రుణాలు ఇవ్వాలని సంకల్పించింది .ఇలాంటి పందులు ఫారాలు ఇంకా పెట్టాలని, వాటిని ఓపెనింగ్స్ నేనే చేయాలని నా ఆశ!”

అందరూ చప్పట్లు కొట్టారు.